సాక్షి
కర్నూలు
శుక్రవారం । 11 । ఏప్రిల్ । 2025



పల్లకోత్సవం.. భక్తి పారవశ్యం

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో భక్తిశ్రద్ధలతో గురువారం బంగారు పల్లకోత్సవం నిర్వహించారు. అశేష భక్త జనవాహిని మధ్య ఉత్సవం కమనీయంగా సాగింది.



కమనీయం.. బ్రహ్మోత్సవం

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు కమనీయంగా సాగుతున్నాయి. స్వామివారు గురువారం హనుమత్ వాహనంపై భక్తులకు అభయమిచ్చారు.



నందీశ్వరస్వామికి పరోక్ష సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయంలో గురువారం నందీశ్వరస్వామికి పరోక్షసేవగా విశేషార్చన జరిపించారు. భక్తులు పరోక్ష సేవగా నందీశ్వరస్వామికి విశేష పూజను జరిపించుకున్నారు.

న్యూస్‌రీల్

బడిబయట
53,600 మంది విద్యార్థులు

ఎమ్మిగనూరుటౌన్: జిల్లా వ్యాప్తంగా బడిబయట 53,600 మంది విద్యార్థులు ఉన్నట్లు గుర్తించామని డీఈఓ శామ్యూల్‌పాల్ తెలిపారు. పేదరికం కారణంగా కొందరు విద్యార్థులు తల్లిదండ్రులతో పాటు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారన్నారు. ఇలాంటి వారు రాష్ట్రంలో కర్నూలు జిల్లాలోనే ఎక్కువ సంఖ్యలో ఉన్నారని పేర్కొన్నారు. వలస వెళ్లి మళ్లీ పాఠశాలల్లో చేరిన విద్యార్థులను గురువారం ఎమ్మిగనూరు పట్టణంలోని మాచాని సోమప్ప జెడ్పీ బాలికల హైస్కూల్‌లో పరిశీలించారు. వారితో డీఈఓ మాట్లాడారు. జిల్లాలో వలస వెళ్లి తిరిగి వచ్చి 823 మంది విద్యార్థులు ప్రస్తుతం పాఠశాలల్లో మళ్లీ చేరారన్నారు. ఎమ్మిగనూరు మండలంలో వీరి సంఖ్య 74 వరకు ఉందన్నారు. బడిబయట ఉన్న విద్యార్థుల్లో 300 మంది మృతి చెందారని తెలిపారు. ఎంఈఓలు అంజనేయులు, మధుసుదన్‌రాజు, సీఆర్పీలు, పాఠశాల హెచ్‌ఎంలు కృష్ణమూర్తి, నాగభూషణరెడ్డి పాల్గొన్నారు.

రీసర్వే పకడ్బందీగా చేపట్టాలి



నాసిరకం ఉప్పు వినియోగంపై ప్రశ్నిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

సి.బెళగల్: రీ సర్వే సంబంధిత రైతుల సమక్షంలోనే చేపట్టాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రం సి.బెళగల్‌లో సర్వే పనులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన స్థానిక రైతులతో ముచ్చటించారు. ఖరీఫ్ సాగుకు ముందే భూసార పరీక్షల సమాచారం రైతులకు అందించాలని ఏఈఓ హిమబిందును ఆదేశించారు. ఆ తర్వాత కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరుకుల గదిలో నాణ్యతలేని రాళ్ల ఉప్పు ప్యాకెట్లను గమనించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లల్లో అయోడిన్ లోపం వస్తే ఎలాగని ప్రశ్నించారు. డీసీడీఓ స్నేహలతో ఫోన్‌లో మాట్లాడుతూ ఐఎస్‌ఐ ముద్రలేని ఉప్పును ఎలా వాడుతున్నారని మండిపడ్డారు.

నష్టాన్ని మూసిపెట్టి.. కరువును దాచిపెట్టి!

కరువు మండలాల గుర్తింపులో అన్యాయం

- రబీలో తుడిచిపెట్టుకుపోయిన పంటలు
- పశ్చిమ ప్రాంతంలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు
- కోసిగి మండలంలో అట్టడుగుకు భూగర్భ జలాలు
- గత నవంబర్ నుంచే ఊళ్లకు ఊళ్లే వలసబాట



తుగ్గలి మండలంలో దెబ్బతిన్న రబీ శనగ పైరు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని పశ్చిమ ప్రాంతం కరువు కాటకాలకు నిలయం. ప్రతి యేటా జనవరి నుంచి మే నెల వరకు ఊళ్లకు ఊళ్లే వలసపోవడం సర్వసాధారణం. 2024-25 సంవత్సరంలో కూడా వ్యవసాయం కలసిరాక ఈ ప్రాంతంలోని ప్రజలు గతంలో ఎప్పుడూ లేనివిధంగా వలసబాట పట్టారు. కోసిగి మండలంలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటాయి. ఇప్పటికే వివిధ మండలాల్లో తాగునీటి సమస్య, పశుగ్రాసం కొరత ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లోనూ కరువు మండలాల ఎంపికలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. వర్షాధారం కింద సాగు చేసిన పంటలతో పాటు.. బావులు, బోర్ల కింద సాగు చేసిన వేరుశనగ, జొన్న, మొక్కజొన్న పంటలు కూడా భూగర్భ జలాలు అడుగంటి చేతికంద లేదు. ఈ నష్టాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కరువు మండలాలను గుర్తించడం చూస్తే జిల్లా యంత్రాంగం, ప్రభుత్వం ఎంతో నిర్లక్ష్యంగా వ్యవహరించాయో అర్థమవుతోంది.

సాగు తగ్గి పంట నష్టపోయినా..

పశ్చిమ ప్రాంతంలోని తుగ్గలి, దేవనకొండ, ఆలూరు, కోసిగి, ఆదోని, గోనెగండ్ల, నందవరం, మంత్రాలయం, హోలహర్వి, హొళగుంద, చిప్పగిరి, కౌతాళం, పెద్దకడుబూరు మండలాల్లో 2024-25 ఖరీఫ్, రబీ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం పెద్దకడుబూరు, కౌతాళం మండలాలను మాత్రమే కరువు ప్రాంతాలుగా గుర్తించింది. ఈ మండలాలకు ఇన్‌పుట్ సబ్సిడీ కోసం గత ఏడాది డిసెంబర్ 10న ఇన్‌పుట్ సబ్సిడీ రూ.25.24 కోట్లు విడుదల చేయాలని జిల్లా యంత్రాంగం నివేదిక పంపింది. అయితే ఇంతవరకు అతీగతీ లేకపోయింది. ఖరీఫ్‌తో పోలిస్తే రబీలో మరింత దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయి. కరువు మండలాలుగా గుర్తించని 16 మండలాల్లో సాధారణ సాగు 64,209 హెక్టార్లు ఉండగా 44,384 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. అయినప్పటికీ జిల్లా యంత్రాంగం కరువు ప్రాంతాలుగా గుర్తించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

➤ కర్నూలు జిల్లాలో 26 మండలాలు ఉండగా అన్ని ప్రాంతాల్లో రబీ పంటలు దెబ్బతిన్నాయి. అయితే 10 మండలాలను మాత్రమే కరువు ప్రాంతాలుగా గుర్తించారు.

➤ నంద్యాల జిల్లాలో 29 మండలాలు ఉండగా 4 మండలాలను మాత్రమే కరువు ప్రాంతాలుగా గుర్తించారు. ఏటా కరువుతో సతమతమయ్యే ప్రాంతాలను విస్మరించారు.

ఖాళీ అయిన గ్రామాలు

జిల్లాలోని పశ్చిమ ప్రాంతానికి చెందిన వివిధ మండలాలతో పాటు క్రిష్ణగిరి, సి.బెళగల్ మండలాల నుంచి వలసలు భారీగా ఉన్నాయి. గతంలో ఎప్పుడూ లేని విధంగా 2024 నవంబర్ నుంచే వలసలు మొదలయ్యాయి. దాదాపు 65వేల కుటుంబాలు గుంటూరు, తెలంగాణ ప్రాంతాలకు వలస వెళ్లినట్లు సమాచారం. కోసిగి, పెద్దకడుబూరు, మంత్రాలయం, కౌతాళం మండలాల్లో ఊళ్లకు ఊళ్లే ఖాళీ అయ్యాయి.

బాబు కరువు కవలలు!

2014-15 నుంచి 2018-19 వరకు ప్రతి ఏటా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఐదేళ్లలో వరుసగా నాలుగేళ్లు కరువు ప్రాంతాలను గుర్తించారు. చంద్రబాబు, కరువు కవలలు అనే ప్రచారం ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన మొదటి ఏడాదే కరువు మండలాలను ఎక్కువగా ప్రకటిస్తే ఈ ప్రభావం ముఖ్యమంత్రిపై పడుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వ పెద్దల సూచనల మేరకు కరువు తీవ్రతను తగ్గించి చూపినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా నంద్యాల జిల్లాలో ఖరీఫ్‌లో కరువు మండలాలను చూపలేదు, రబీలో నాలుగు మండలాలను మాత్రమే గుర్తించారు. కర్నూలు జిల్లాలో ఖరీఫ్‌లో కేవలం 2 మండలాలను, రబీలో 10 మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించడం గమనార్హం.

డోన్ నియోజకవర్గంపై వివక్ష

కూటమి ప్రభుత్వం డోన్ నియోజకవర్గంపై వివక్ష చూపుతోంది. ఈ నియోజక వర్గం పూర్తిగా వర్షాధారంపైనే ఆధారపడి ఉంది. 2024-25 ఖరీఫ్‌లో అధిక వర్షాలు, అనావృష్టి పరిస్థితులతో పంటలు దెబ్బతిన్నా పట్టించుకోలేదు. రబీలో అనావృష్టి పరిస్థితులు పునరావృతమైనప్పటికీ అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. నంద్యాల జిల్లాలో 29 మండలాలు ఉండగా 2024-25 రబీ సీజన్‌లో డోన్ నియోజకవర్గంలోని బేతంచెర్ల, సంజామల, బనగానపల్లి, కొలిమిగుండ్ల మండలాలను మాత్రమే కరువు ప్రాంతాలుగా గుర్తించారు. కరువు పీడిత మండలాలైన ప్యాపిలి, డోన్ మండలాలను విస్మరించడం పట్ల రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ప్రభావం చూపని ఈశాన్య రుతుపవనాలు

➢ ప్రతి ఏటా అక్టోబర్ నుంచి ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తాయి.
➢ 2024-25 రబీలో ఈశాన్య రుతుపవనాలు ఏ మాత్రం ప్రభావం చూపలేదు.
➢ 2024 అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు సాధారణ వర్షపాతం 147.2 మి.మీ ఉండగా 106.8 మి.మీ మాత్రమే నమోదైంది.
➢ ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో నమోదైన వర్షపాతం సున్నా.
➢ మార్చి నెలలో కూడా 60శాతం లోటు వర్షపాతం ఉంది.
➢ వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయి.

శనగ సాగు చేసి నష్టపోయాం



మాకున్న నాలుగు ఎకరాల్లో రబీ సీజన్‌లో శనగ సాగు చేశాం. ఎకరాకు రూ.20వేల వరకు పెట్టుబడి పెట్టాం. వర్షాలు లేక భూమిలో తేమ లేకపోవడంతో దిగుబడి తగ్గింది. ఎకరాకు సగటున 6 క్వింటాళ్ల దిగుబడి రావాలి. కానీ 3 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. క్వింటాకు రూ.5వేల ధర మాత్రమే లభించింది. పూర్తిగా నష్టపోయాం. మా మండలాన్ని ప్రభుత్వం ఎందుకు కరువు ప్రాంతంగా గుర్తించలేదో తెలియడం లేదు.

– పూజారి బీరప్ప, రాతన, తుగ్గలి మండలం

భూగర్భ జలాలు అడుగంటి పంట నష్టం



పశ్చిమ ప్రాంతంలోని కోసిగి మండలం అత్యంత వెనుకబడిన ప్రాంతమని అందరికీ తెలుసు. అయితే 2024-25 కరువు మండలాల జాబితాలో మా మండలం లేకపోవడం దారుణం. వందగల్లు గ్రామంలో భూగర్భ జలాలు 40 మీటర్ల అడుక్కు వెళ్లాయి. మేము రబీలో ఐదు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశాం. భూగర్భ జలాలు అడుగంటి పంట పూర్తిగా దెబ్బతినింది. పెట్టుబడి ఎకరాకు రూ.25 వేల వరకు వచ్చింది. నాలుగు బస్తాల పంట కూడా రాలేదు.

– ఈరన్న, వందగల్లు, కోసిగి మండలం

జిల్లా మొత్తాన్ని కరువు ప్రాంతంగా గుర్తించాలి



ఖరీఫ్ కరువు మండలాలను ప్రకటించడంలో జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగింది. రబీలో అన్ని మండలాల్లో మరింత తీవ్ర అనావృష్టి పరిస్థితులు నెలకొన్నాయి. కానీ జిల్లాలో కర్నూలు జిల్లాలో 10 మండలాలు, నంద్యాల జిల్లాలో 4 మండలాలను మాత్రమే కరువు ప్రాంతాలుగా గుర్తించడం అన్యాయం. ఉమ్మడి కర్నూలు జిల్లా మొత్తాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలి.

– జి.రామకృష్ణ, జిల్లా కార్యదర్శి, ఏపీ రైతుసంఘం

బాబు, పవన్‌లను నమ్మి మోసపోయాం



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు



కలెక్టరేట్ లోపలికి వెళ్లేందుకు గేట్లు ఎక్కుతున్న డీఎస్సీ అభ్యర్థులు

డీఎస్సీ అభ్యర్థుల్లో కట్టలు తెంచుకున్న ఆక్రోశం

- కర్నూలు కలెక్టరేట్ ముట్టడి
- పోలీసులు, నిరుద్యోగ అభ్యర్థుల మధ్య తోపులాట

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను నమ్మి మోసపోయామని డీఎస్సీ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అదిగో.. ఇదిగో అంటూ డీఎస్సీ నోటిఫికేషన్ కాలయాపన చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టరేట్‌ను ముట్టడించారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో గేట్లు ఎక్కి దూకేందుకు ప్రయత్నించగా తోపులాట చోటు చేసుకుంది. చివరకు కేసులుపెట్టి జైలుకు పంపుతామని త్రీటౌన్ సీఐ శేషయ్య హెచ్చరించడం.. కలెక్టర్ తరఫున స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగ ప్రసన్న లక్ష్మీ వచ్చి వివరణ ఇవ్వడంతో నిరుద్యోగులు కాస్తా వెనక్కి తగ్గారు.



ప్లకార్డు ప్రదర్శిస్తున్న అభ్యర్థి

ప్రతి నెలా రూ.10వేల పైనే ఖర్చు



డీఎస్సీ కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నాం. ఎలాగైనా టీచర్ కావాలన్నదే నా లక్ష్యం. డీఎస్సీ కోచింగ్, ప్రిపరేషన్ కోసం హాస్టల్‌లో ఉండటంతో ప్రతినెలా రూ.10వేల పైనే ఖర్చు అవుతోంది. ప్రభుత్వం మా బాధలను పట్టించుకోవాలి.

– దేవిబాయి, ఎల్‌బండతండా, వెల్దుర్తి మండలం

సీఎం మొదటి సంతకానికే దిక్కులేకపోతే ఎలా?



విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మార్చిలోపు నోటిఫికేషన్ ఇస్తామని చెప్పినా మాట నిలుపుకోలేదన్నారు. చంద్రబాబునాయుడు కలుగజేసుకొని ఏప్రిల్‌లో ఇస్తామని చెప్పినా మళ్లీ శిక్షణ అంటూ కాలయాపన చేస్తున్నారు. సీఎం చేసిన మొదటి సంతకానికే దిక్కులేకపోతే ఎలా. వారం రోజుల్లో నోటిఫికేషన్‌ను విడుదల చేయకపోతే ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రుల కాన్వాయ్‌లను అడ్డుకుంటాం.

– నగేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి, డీవైఎఫ్‌ఐ

కాలయాపన దేనికి సంకేతం



గత ప్రభుత్వ హయాంలో వచ్చిన నోటిఫికేషన్ రద్దు చేసి మెగా డీఎస్సీ అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్‌ను పది రోజుల్లో విడుదల చేస్తామని చెప్పి మొదటి సంతకం చేశారు. పది నెలలు గడిచినా అతీగతీ లేదు. కాలయాపన దేనికి సంకేతం.

– సులోచన, శివవరం, నంద్యాల జిల్లా

మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉమ్మడి కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ నేతలు



దిశానిర్దేశం

విజయవాడలోని తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఉమ్మడి కర్నూలు జిల్లా నేతలతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమావేశం నిర్వహించారు. పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. వైఎస్సార్‌సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, మాజీ ఎమ్మెల్యేలు సాయిప్రసాద్ రెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, కాటసాని రామిరెడ్డి, కంగాటి శ్రీదేవి, శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి, హాఫీజ్‌ఖాన్, ఎమ్మెల్సీలు మధుసూదన్, ఇసాక్, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కర్నూలు మేయర్ బీవై రామయ్య తదితరులు హాజరయ్యారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మునిసిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కార్పొరేటర్లు, మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

మాతృ మరణ వేదన!

- జిల్లాలో పెరుగుతున్న మాతృమరణాలు
- 2024-25లో 20 మంది మృతి
- 35 శాతంపైగా హైరిస్క్ గర్భిణులు
- క్షేత్రస్థాయిలో కొరవడిన పర్యవేక్షణ
- నేడు జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం

☛ పురిటి నొప్పులు రావడంతో కోసిగి మండలం డి.బెళగల్ గ్రామానికి చెందిన నాగేంద్రమ్మ (22) ఈ నెల 4వ తేదీ కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. సురక్షిత కాన్పు జరిగి మగ శిశువుకు ఆమె జన్మిచ్చింది. అయితే కాన్పు అయిన వెంటనే ఆమెకు ఫిట్స్ రావడంతో కోలుకోలేక మృతి చెందారు. సరైన పోషకాహారం తీసుకోవడమే ఇందుకు కారణమని వైద్యులు చెప్పారు.

☛ పత్తికొండ పట్టణం బుడగ జంగాల కాలనీకి చెందిన మౌనిక(20) తొలి ప్రసవంలో భాగంగా గతేడాది నవంబర్ 30న ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ ఆమెకు ఫిట్స్ రావడంతో కడుపులోనే శిశువు మృతి చెందింది. వైద్యులు మృతశిశువును తీసి తల్లిని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రెఫర్ చేశారు. ఆసుపత్రికి తీసుకెళ్లేలోపే మౌనిక కూడా మృతి చెందింది.



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ప్రసూతి విభాగంలో గర్భిణులు

కర్నూలు(హాస్పిటల్): తనకు పండంటి బిడ్డ జన్మించాలని, ఆ బిడ్డ ఆరోగ్యంగా ఉండాలని ప్రతి గర్భిణీ కోరుకుంటుంది. అందుకోసం 9 నెలల పాటు కడుపులో బిడ్డను ఎంతో ఓపికగా మోస్తుంది. కొన్నిసార్లు తనకు ఇష్టమైన ఆహారాన్ని తినకుండా కడుపుకట్టుకుంటుంది. ఆసుపత్రిలో గర్భంలో ఉన్న బిడ్డకు స్కానింగ్ చేస్తూ డాక్టర్ చూపిస్తుంటే చూసి ఎంతో మురిసిపోతుంది. పుట్టబోయే బిడ్డ కోసం అనేక రకాలు ఇంజెక్షన్లు, మందులు మింగుతుంది. ఈ క్రమంలో ఆరోగ్యంలో ఒడిదుడుకులను ఎదుర్కొన్నా తట్టుకుని నిలబడుతుంది. ఇంత కష్టపడ్డాక బిడ్డ జన్మిస్తే చూసి ఆనంద బాష్పాలు రాలుస్తుంది. అయితే కొందరు మహిళలు ఇంత కష్టపడ్డా కన్నబిడ్డను చూడకుండానే కన్నుమూస్తున్నారు. మహాత్మాగాంధీ సతీమణి కస్తూరిబాయి గాంధీ జయంతిని పురస్కరించుకుని 2003 నుంచి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 11న జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

గతంలో 'ఆరోగ్యశ్రీ' వర్తింపు

జిల్లాలోని 35 పాత, 12 కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, ఐదు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో, ఆదోనిలోని ఏరియా ఆసుపత్రి, మాతాశిశు ఆసుపత్రి, కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో, అలాగే 40కి పైగా ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసవాలు జరుగుతున్నాయి. ప్రతి సంవత్సరం ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో 45 వేల నుంచి 46వేల మంది ప్రసవిస్తుంటారు. ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింపజేసింది. దీంతో ఇంటి వద్ద ప్రసవాలు తగ్గిపోయాయి.

ప్రస్తుతం ఇలా..

రాష్ట్రంలో 'కూటమి' ప్రభుత్వం వచ్చాక క్షేత్రస్థాయిలో గర్భిణులపై సరైన పర్యవేక్షణ లేదు. దీంతో జిల్లాలో మాతృమరణాలు పెరుగుతున్నాయి. జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో 45,040 మంది గర్భిణులు రిజిష్టర్ అయ్యారు. వీరిలో 10,072 (22.36శాతం)మందిని హైరిస్క్ గర్భిణులుగా గుర్తించారు. ఎమ్మిగనూరు, ఆదోని, కల్లూరు మండలం లక్ష్మీపురం, కర్నూలు నగరంలోని ఎన్‌టీఆర్ కాలనీ, గార్గేయపురం, కలుదేవకుంట్ల, లద్దగిరి, కల్లూరు, గూడూరు దళితవాడ, పెద్దకడుబూరు, పెద్దతుంబళం, ముజఫర్‌నగర్, మద్దికెర, బదినేహాల్, ఆదోనిలోని ఇందిరానగర్ యుపీహెచ్‌సీ, పీహెచ్‌సీ పరిధిల్లో 25 నుంచి 36 శాతం వరకు మహిళలు హైరిస్క్ పరిస్థితిని ఎదుర్కొంటున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. గర్భిణుల్లో 45.36 శాతం మందికి 11 గ్రాములలోపు, కేవలం 3.30 శాతంలోపు మందికే 7 గ్రాముల్లోపు రక్తం ఉన్నట్లు తెలుస్తోంది.

పర్యవేక్షణ కరువు

ఎవ్వరైనా మహిళ గర్భం దాల్చిన వెంటనే యాప్‌లో పేరు నమోదు చేయించి అప్పటి నుంచి ప్రసవం అయ్యేవరకు ప్రత్యేక పర్యవేక్షణ చేయాల్సి ఉంది. అయితే ఈ కార్యక్రమం సక్రమంగా జరగడం లేదు. హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించి మాతృ మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సి ఉన్నా మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం కింద ప్రతి నెలా 9వ తేదీన సీహెచ్‌సీలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షలకు గర్భిణులను వైద్యసిబ్బంది సరిగ్గా తీసుకెళ్లడం లేదు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో మాతృమరణాలు ఇలా..

సంవత్సరం	ప్రసవాలు	మృతులు
2019-20	63,453	40
2020-21	62,817	28
2021-22	46,586	30
2022-23	51,142	13
2023-24	28,970	10

కర్నూలు జిల్లాలో మాత్రమే 2024-25లో 20 మాతృమరణాలు జరిగాయి.

హైరిస్క్ కేసులు వస్తున్నాయి



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల (జీజీహెచ్)లో ఒకప్పుడు ప్రతిరోజూ 35 నుంచి 40 దాకా ప్రసవాలు జరిగేవి. ఇప్పుడు ప్రసవాలకు ఆరోగ్యశ్రీ అమలు కావడంతో చాలా మంది ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారు. కేవలం హైరిస్క్ అయితేనే జీజీహెచ్‌కు వస్తున్నారు.

– డాక్టర్ శ్రీలక్ష్మి, గైనకాలజీ హెచ్‌ఓడీ, జీజీహెచ్, కర్నూలు

పోకిరీల భరతం పడుతూ..

- జిల్లాలో కీలకంగా యాంటీ ఈవ్ టీజింగ్ బృందాలు
- ఈవ్ టీజింగ్ నిరోధానికి డ్రోన్ సేవలు
- జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజూ 36 ఈవ్ టీజింగ్ బీట్స్ విధులు
- రెండు మాసాల్లో 700 మంది పోకిరీలకు స్టేషన్‌లో కౌన్సెలింగ్

కర్నూలు: బాలికలు, యువతులు, మహిళల భద్రతకు జిల్లా పోలీసులు పెద్దపీట వేస్తున్నారు. వేధింపులకు పాల్పడుతున్న పోకిరీల భరతం పడుతున్నారు. మఫ్టీలో ఉంటూ రద్దీ ప్రాంతాల్లో నిఘా సారించే రక్షకులు ఆకతాయిల్లో మార్పు తెచ్చేందుకు వివిధ దశల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. జిల్లాలో యాంటీ ఈవ్ టీజింగ్ బృందాలు కీలకంగా మారాయి. అధికారులు, సిబ్బంది ప్రత్యేక తనిఖీలతో విద్యార్థులు, మహిళలకు తాము న్నామనే భరోసా కల్పిస్తున్నారు.

పోకిరీల కట్టడికి డ్రోన్ కెమెరాలతో నిఘా...

పాశ్చాత్య పోకడలు, సామాజిక మాధ్యమాల ప్రభావంతో కొందరు బాలురు, యువకులు తప్పుడు మార్గాలను అనుసరిస్తున్నారు. తమ కుటుంబ నేపథ్యాన్ని మరచి కోరి కష్టాలు తెచ్చుకుంటున్నారు. వారిని కట్టడి చేసేందుకు జిల్లాలోని కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ పోలీస్ సబ్ డివిజన్ల పరిధిలో యాంటీ ఈవ్ టీజింగ్ బృం


ఓ విద్యా సంస్థ వద్ద పోకిరీల కదలికలను పసిగట్టేందుకు డ్రోన్‌తో తీసిన చిత్రం

దాలు పనిచేస్తున్నాయి. విద్యాసంస్థల ఆవరణాలు, ప్రయాణ ప్రాంగణాలు, రద్దీ కూడళ్ల ఇతర ప్రాంతాల్లో గస్తీ తిరుగుతున్నారు. తరచూ వేధింపులు జరిగే ప్రాంతాలను హాట్ స్పాట్లుగా గుర్తిస్తున్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా ఆయా ప్రాంతాల్లో పర్యవేక్షణ కొనసాగుతోంది.

విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు...

విద్యా సంస్థల్లో పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సామాజిక మాధ్యమాల వినియోగం, సైబర్ నేరాల


రాయలసీమ యూనివర్సిటీ వద్ద డ్రోన్ కెమెరాతో తీసిన చిత్రం

కట్టడి, పోలీసు సేవలు, మహిళా చట్టాల వినియోగం తీరును వివరిస్తున్నారు. జిల్లాలో 39 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. వాటి పరిధిలోని విద్యాసంస్థల వద్ద ప్రత్యేకంగా ప్రతిరోజూ 36 ఈవ్ టీజింగ్ బీట్స్ విధులు నిర్వహిస్తున్నారు. ఎప్పటికప్పుడు ఆకతాయిలను పట్టుకుని కౌన్సెలింగ్ చేస్తున్నారు.

డ్రోన్లతో నిఘా..

డ్రోన్లు జిల్లా పోలీసుల అమ్ముల పొదిలో సరికొత్త ఆయుధాలుగా మారాయి. ఇప్పటి వరకు పోలీస్ పెట్రోలింగ్ అంటే వాహనాల సైరన్లు, బూట్ల చప్పుళ్లు వినిపించేవి. ఇప్పుడు పరిస్థితులు మారాయి. తమ ప్రతినిధులుగా డ్రోన్లను పంపుతున్నారు. ఆకాశంలో చక్కర్లు కొట్టిస్తూ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. డ్రోన్ల రాకతో నిర్మానుష్య ప్రదేశాల్లో మద్యపానంతో పాటు విద్యాసంస్థల వద్ద నిఘా పెరిగింది. ఈవ్ టీజింగ్ నిరోధానికి పోలీసులు డ్రోన్ కెమెరాల సేవలను వాడుతున్నారు. పాఠశాలలు, కళాశాలలు మొదలయ్యే, ముగిసే సమయాల్లో కీలక ప్రాంతాల్లో డ్రోన్లను వినియోగించి ఆకతాయిల ఆగడాలకు ముకుతాడు వేసే లా ప్రణాళిక రచించి అమలు చేస్తున్నారు. భవిష్యత్తులో కర్నూలు నగరంతో పాటు జిల్లాలోని ముఖ్య పట్టణ ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కూడా డ్రోన్ సేవలను వినియోగించనున్నట్లు ఓ పోలీస్ అధికారి తెలిపారు.

రెండు నెలల వ్యవధిలో 700 మంది పోకిరీలకు కౌన్సెలింగ్...

జిల్లా ఎస్పీగా విక్రాంత్ ఫిబ్రవరి 1వ తేదీన బాధ్యతలు చేపట్టారు. యాంటీ ఈవ్ టీజింగ్‌ను అరికట్టాలనే ఉద్దేశ్యంతో జిల్లా వ్యాప్తంగా ఈవ్ టీజింగ్ బీట్స్‌ను ఆయన కొత్తగా అమలులోకి తెచ్చారు. కళాశాలలు, పాఠశాలల వద్ద ఈవ్ టీజింగ్‌ను అరికట్టడం కోసం జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజూ 36 ఈవ్ టీజింగ్ బీట్స్ విధులు నిర్వహిస్తున్నారు. ఈవ్ టీజింగ్‌కు పాల్పడేవారిపై నిఘా ఉంచి రెండు నెలల వ్యవధిలో సుమారు 7 వేల మంది పోకిరీలకు ఈవ్ టీజింగ్ బీట్స్ పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. పద్ధతి మార్చుకోకుండా పదేపదే మహిళలను వేధించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందడంతో క్షేత్రస్థాయిలో పోలీసులు పోకిరీల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారు.

నిర్భయంగా ఫిర్యాదు చేయాలి



బాలికలు, యువతులు, మహిళలు ధైర్యంగా ఉండాలి. ఎవరైనా వేధింపులకు పాల్పడటం, ఉద్దేశ్యపూర్వకంగా వెంటపడటం, అవహేళనగా మాట్లాడితే నిర్భయంగా పోలీసులకు సమాచారమివ్వాలి. ఆపదలో ఉన్నా, వేధింపులకు గురైనా డయల్ 100 సేవలను వినియోగించుకోవచ్చు. **– విక్రాంత్ పాటిల్, ఎస్పీ**

16న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను ఈ నెల 16న ఉదయం 10 గంటల నుంచి జెడ్పీలోని మినీ సమావేశ భవనంలో నిర్వహిస్తున్నట్లు సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి నోటు ఉత్తర్వుల మేరకు ఈ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశాల్లో గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం, విద్య, వైద్యం, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, పనులు, ఆర్థిక ప్రణాళిక తదితర అంశాలపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరిగే సమావేశాలకు ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, జెడ్పీటీసీ సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు వారికి కేటాయించిన సమయంలో హాజరు కావాలని సీఈఓ కోరారు.

పీఆర్ పాలనా సంస్కరణల్లో ఏఓలకు అన్యాయం

- ఏపీ పీఆర్ మినిస్ట్రీయల్ ఉద్యోగుల సంఘం

కర్నూలు(అర్బన్): పంచాయతీరాజ్ శాఖలో చేపట్టిన పాలనా సంస్కరణల్లో భాగంగా విడుదల చేసిన జీఓ నెంబర్ 35 మేరకు జిల్లా పరిషత్, మండల పరిషత్‌ల్లో పని చేస్తున్న పరిపాలనాధికారులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఏపీ పీఆర్ మినిస్ట్రీయల్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సీ మురళీమోహన్‌రెడ్డి, కే రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఫీడర్ కేటగిరిని అనుసరించి ఎంపీడీఓ పదోన్నతుల్లో ఏఓలకు 34 శాతం కేటాయింపు జరిగిందని వారు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇదే సందర్భంలో ఈఓఆర్‌డీలకు 33 శాతం, నేరుగా ఎంపీడీఓలకు 30 శాతం, ఇతరులకు 3 శాతం కేటాయింపులు జరిగాయన్నారు. అయితే ప్రస్తుతం చేపట్టిన సంస్కరణల్లో నేరుగా ఎంపీడీఓ నియామక కోటాను రద్దు చేసి ఎంపీడీఓ పదోన్నతులకు ఫీడర్ కేటగిరి ప్రకారం కేటాయించాల్సి ఉండగా, ఒక వర్గం వారికి అదనంగా 27 శాతాన్ని కేటాయించడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వేలాది మంది పరిపాలనాధికారులకు నష్టం జరుగుతుందన్నారు. ఈ నష్టం కింది స్థాయిలో ఉన్న ఉద్యోగుల పదోన్నతులపై కూడా ప్రభావం చూపుతుందన్నారు. ఈ నిష్పత్తి కొనసాగితే పరిపాలనాధికారులకు ఎంపీడీఓల పదోన్నతి తీరని కలగా మిగిలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పీఆర్ అండ్ ఆర్‌డీ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ పునరాలోచించి ఎంపీడీఓల పదోన్నతి నిష్పత్తిని సవరించి అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

జడ్జీలకు సన్మానం



అదనపు జడ్జీలను సన్మానిస్తున్న న్యాయవాదులు

కర్నూలు(సెంట్రల్): జిల్లా మొదటి, ఆరో అదనపు కోర్టు జడ్జీలుగా పనిచేసి బదిలీపై వెళ్తున్న జి.భూపాల్‌రెడ్డి, పి.పాండురంగారెడ్డిని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గురువారం కోర్టు ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబద్ధతతో పని చేస్తే వృత్తికి న్యాయం చేసినట్లు అవుతుందన్నారు. బదిలీపై వెళ్తున్న జడ్జీలు జి.భూపాల్, పి.పాండు రంగారెడ్డిలు మాట్లాడుతూ.. తమపై ఎంతో ఆదరాభిమానం చూపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ప్రకటించారు. విధి నిర్వహణలో ఎవరికైనా సందేహాలు ఉంటే తాము ఎక్కడ ఉన్నా నివృత్తి చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ్ చౌదరి, ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, రాష్ట్ర బార్ అసోసియేషన్ సభ్యుడు పి.రవిగువేరా, అదనపు జిల్లా జడ్జీలు ట.లీలావతి, ఇ.రాజేంద్రబాబు, లక్ష్మీరాజ్యం, సీనియర్ సివిల్ జడ్జి టి.మల్లీశ్వరి, జూనియర్, సివిల్ జడ్జీలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల హాజరు పెంచాలి

- ఏపీడీ, ఏపీవోలకు డ్వామా పీడీ ఆదేశాలు


మాట్లాడుతున్న పీడీ వెంకటరమణయ్య

కర్నూలు(అగ్రికల్చర్): ఉపాధి పనులకు కూలీల హాజరు పెంచడంపై వెంటనే దృష్టి సారించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య ఏపీడీ, ఏపీవోలను ఆదేశించారు. పశువుల షెడ్ల నిర్మాణపు పనులను కూడా వేగవంతం చేయాలన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని డ్వామా సమావేశ మందిరంలో ఏపీడీలు, ఏపీవోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధి పనులకు ప్రతి రోజు 1.50 లక్షల మందికి పనులు కల్పించాలనేది లక్ష్యమని, ప్రస్తుతం 80 వేల మంది వరకు హాజరవుతున్నారన్నారు. అన్ని గ్రామాల్లో పనులు పెద్ద ఎత్తున చేపట్టి వలసలను పూర్తిగా నియంత్రించాలని తెలిపారు. ఫాంపాండ్స్ పనులు వేగవంతం చేసి మే నెల చివరి నాటికి పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ జవాబుదారి తనంతో పని చేసి లక్ష్యాలను అందుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు పీడీ మాధవీలత,ఏపీడీలు పద్మావతి, లక్ష్మన్న, పక్కీరప్ప, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత అభివృద్ధికి ఎన్ఆర్ఎల్ఎం ప్రాజెక్టులు

- ఉమ్మడి జిల్లా చేనేత, జౌళి శాఖ ఏడీ నాగరాజరావు వెల్లడి

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లాలో చేనేత పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు ఎన్ఆర్ఎల్ఎం కింద మహిళ ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తున్నట్లుగా జిల్లా చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు నాగరాజరావు తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన – జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ (ఎన్ఆర్ఎల్ఎం) కింద నందవరంలో 2, నాగులదిన్నెలో 2, కోడుమూరులో రెండు ప్రకారం చేనేత పరిశ్రమ అభివృద్ధికి మహిళలతో ప్రత్యేక ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అదే విధంగా నంద్యాల జిల్లాలో బనగానపల్లిలో 2, ప్యాపిలి మండలం గుట్టలపల్లిలో 1 ప్రాజెక్టు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో ప్రాజెక్టులో 25 మంది నుంచి 50 మంది వరకు మహిళలు ఉంటారని, రూ.25 లక్షల నుంచి రూ.45 లక్షల వరకు ఖర్చు చేసి అధునాతన చేనేత పరికరాలు, పనిముట్లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. నవాసిలో 77.37 ఎకరాల్లో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు కలెక్టర్ ద్వారా ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు. ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘం ఉత్పత్తి చేస్తున్న బెడ్‌షీట్లకు భౌగోళిక గుర్తింపు కోసం ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు.

ఎస్సీలకు రూ.40.73 కోట్ల రుణాలు

- ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె.తులసీదేవి



కర్నూలు(అర్బన్): జిల్లా షెడ్యూల్డు కులాల సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో అర్హులైన ఎస్సీలకు రూ.40.73 కోట్ల రుణాలను అందించనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె.తులసీదేవి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ స్వయం ఉపాధి, రవాణా, వ్యవసాయం తదితర రంగాల ద్వారా ఉపాధి పొందేందుకు మొత్తం 973 మందికి లబ్ధి చేకూర్చేందుకు రూపొందించిన వార్షిక ప్రణాళికకు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆమోదం తెలిపారన్నారు. అర్హులు ఈనెల 14 నుంచి మే 10వ తేది లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

- రూ.3లక్షల వరకు రుణాలను 176 మందికి అందిస్తామని, ఇందులో సబ్సిడీ 60 శాతం, బ్యాంకు లోన్ 35 శాతం, లబ్ధిదారుని వాటా 5 శాతం ఉంటుందన్నారు.
- రూ.3లక్షలకు పైబడి రుణాలను 493 మందికి అందిస్తామని, ఇందులో సబ్సిడీ 40 శాతం, బ్యాంకు లోన్ 55 శాతం, లబ్ధిదారుని వాటా 5 శాతం ఉంటుందన్నారు.
- రూ.10 లక్షలకు పైగా విలువ చేసే ఒక్క యూనిట్ (ఈవీ బ్యాటరీ చార్జింగ్ యూనిట్) మాత్రమే ఉందని, ఇందులో సబ్సిడీ 40 శాతం, బ్యాంకు లోన్ 55 శాతం, లబ్ధిదారుని వాటా 5 శాతం ఉంటుందన్నారు.
- ట్రాన్స్‌పోర్టు సెక్టార్‌లో 294 యూనిట్లు ఉన్నాయని, ఇందులో రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల విలువ చేసే వాహనాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఐదుగురు సభ్యులుగా ఉన్న గ్రూపులకు రుణాలు అందిస్తామని, ఇందులో 9 యూనిట్లు ఉన్నాయన్నారు.

రేపటి నుంచి ఫోరెన్సిక్ వైద్యుల రాష్ట్ర సదస్సు


సమావేశంలో బ్రోచర్లు విడుదల చేస్తున్న ఫోరెన్సిక్ వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో ఈ నెల 12, 13వ తేదీల్లో ఫోరెన్సిక్ అండ్ టాక్సికాలజీ వైద్యుల 6వ రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు ఫోరెన్సిక్ విభాగాధిపతి డాక్టర్ టి. సాయి సుధీర్ చెప్పారు. గురువారం ఫోరెన్సిక్ విభాగంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ ఆధ్వర్యంలో కర్నూలులో మొదటిసారిగా రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. 'ఫోరెన్సిక్ ఫిజీషియన్ ఏ క్లినికల్ ఫోరెన్సిక్ మెడిసిన్ ఎక్స్‌పర్ట్' అనే థీమ్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ నరసింహం, డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు 65 మంది పోలీస్ అధికారులతో పాటు మొత్తం 394 మంది వైద్యులు ఏపీ, తెలంగాణా, కర్ణాటక, కేరళ, తమిళనాడు నుంచి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. త్వరలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఫోరెన్సిక్ మెడిసిన్ ఓపీ ప్రారంభిస్తామన్నారు. అత్యవసర కేసులకు(ఎంఎల్‌సీ) కాల్ డ్యూటీ ద్వారా హాజరై డ్యూటీ డాక్టర్‌లకు సలహాలు, సూచనలు ఇస్తామన్నారు. సమావేశంలో ఫోరెన్సిక్ ప్రొఫెసర్ డాక్టర్ పి. బ్రహ్మాజీమాస్టర్, వైద్యులు వైకేసీ రంగయ్య, కె.నాగార్జున, వి.కోటేశ్వరరావు, పి. హరీష్‌కుమార్, సురేఖ, మహ్మద్ సాహిద్ పాల్గొన్నారు.

14న జీజీహెచ్ హెచ్‌డీఎస్ సమావేశం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల(జీజీహెచ్) ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సమావేశం ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఆయన తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో సభ్యులు ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చిస్తారన్నారు. హెచ్‌డీఎస్ చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, మెంబర్ అండ్ కన్వీనర్‌గా తాను, సభ్యులుగా ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, కోడుమూరు ఎమ్మెల్యే బి. దస్తగిరి, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యంతో తదితరులు హాజరవుతారన్నారు. ఈనెల 19న రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆసుపత్రిలోని పలు విభాగాలు సందర్శించడంతో పాటు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను ఆయన పరిశీలిస్తారని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, ఏడీ మల్లేశ్వరమ్మ పాల్గొన్నారు.

రూల్ ఆఫ్ రిజర్వేషన్ సక్రమంగా అమలు చేయాలి


గోన నాగరాజును సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు (అర్బన్): రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను సక్రమంగా అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని మాల గెజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు కోరారు. గురువారం రాత్రి స్థానిక జెడ్పీ ప్రాంగణంలోని ఎంపీపీ హాల్‌లో మాల గెజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం గౌరవ సలహాదారు గోన నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి అసోసియేషన్ చైర్మన్ సోమన్న, కో–చైర్మన్ భాస్కర్, కోశాధికారి డాక్టర్ వై.రాజశేఖర్, కన్వీనర్ చంద్రశేఖర్, కో–కన్వీనర్ మల్లికార్జున హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మాలల అభివృద్ధి కోసం వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలన్నారు. త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించి మాలల సంక్షేమం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై భవిష్యత్తు ప్రణాళికలను రూపొందిస్తామని చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఏపీ ఈడబ్ల్యూఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బాధ్యతలు స్వీకరించిన గోన నాగరాజును ఘనంగా సన్మానించారు. ఈ నేపథ్యంలోనే పాస్టర్ ప్రవీణ్ మృతికి రెండు నిముషాలు మౌనం పాటించారు.

క్లుప్తంగా

కుక్కల దాడిలో రెండు దుప్పులు మృతి


కుక్కల దాడిలో మరణించిన దుప్పి

ఆత్మకూరురూరల్: నల్లకాల్వ గ్రామ శివార్లలో ఉన్న వైఎస్సార్ స్మృతివనం వెనక వైపు ఉన్న పొలాల్లో ఊరకుక్కల దాడిలో రెండు దుప్పులు మృత్యువాత పడ్డాయి. వెలుగోడు నార్త్‌బీట్ ఫారెస్ట్‌లైన్ పక్కనే ఉన్న ఒక వ్యవసాయ బావి వద్ద ఉన్న నీటి తొట్టిలో నీరు తాగేందుకు వచ్చిన దుప్పుల మందపై అక్కడ ఉన్న కుక్కల గుంపు దాడికి పాల్పడింది. దుప్పులు అడవిలోకి పారి పోగా రెండు కుక్కల బారిన పడి తీవ్ర గాయాలై మృతి చెందాయి. సమాచారం అందుకున్న వెలుగోడు రేంజ్ అధికారి ఖాన్ తన సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. దుప్పులకు స్థానిక వన్యప్రాణి వైద్యనిపుణులతో పోస్ట్ మార్టం చేసి కళేబరాలను దహనం చేయించారు. నెలలో దుప్పులపై కుక్కలు దాడి చేయడం ఇది రెండో సారి. గత వారంలో ఇదే ప్రదేశంలో మూడు దుప్పులు కుక్కల దాడిలో మృత్యువాత పడ్డాయి.

అప్పుల బాధతో ఆత్మహత్య


మృతిచెందిన చిన్నరంగన్న (ఫైల్)

గోనెగండ్ల: అప్పుల బాధ తాళలేక ఓ వలస కూలీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని బంధువులు తెలిపిన వివరాల మేరకు.. బైలుప్పల గ్రామానికి చెందిన తలారి చిన్న రంగన్న (41)కు భార్య రాములమ్మ, కూతురు, కుమారుడు ఉన్నారు. గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. చిన్న రంగన్న గ్రామంలో తెలిసిన వారి దగ్గర తన అవసరాల నిమిత్తం దాదాపు రూ.15 లక్షలు వరకు అప్పు చేశాడు. కుటుంబంతో సహా గత నెల గుంటూరు జిల్లా కట్ట చెరుకూరు మండలం చింతపల్లిపాడు గ్రామానికి బతుకు దెరువు కోసం వలస వెళ్లాడు. అయితే అప్పుల బాధతో మనస్తాపం చెంది గత నెల 31వ తేదీన పని చేసే చోట పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుంటూరు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కర్నూలు ఆస్పత్రికి తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. గుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పుల బాధతో మృతిచెందిన చిన్న రంగన్న కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన వ్యక్తి

కర్నూలు: కర్నూలు శివారులోని ఇ.తాండ్రపాడు గ్రామ సమీపంలో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు గురువారం ఉదయం కర్నూలు రైల్వే హెడ్ కానిస్టేబుల్ టి.సి.మాధవ స్వామి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. బ్లూ కలర్ రౌండ్ నెక్ ఫుల్ హ్యాండ్ టీషర్టు, బూడిద కలర్ లోయర్ ప్యాంటు, బ్రౌన్ కలర్ చెప్పులు ధరించాడు. చెప్పులపై ఎయిర్‌స్టైల్ అనే అక్షరాలు ఉన్నాయి. కుడి వైపు ఛాతీ మీద గాయమై మానని బెందు ఉంది. అలాగే కుడి చేతి మీద 4 చుక్కలు కలిగిన టాటూ గుర్తు ఉంది. ఎడమ వైపు నడుము, వీపుపై నల్లటి పుట్టు మచ్చలు ఉన్నాయి. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 9908889696, 9030481295 నంబర్లకు ఫోన్ చేసి సమాచారమివ్వాలని సీఐ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు.